పోటాపోటీగా గణనాథుడి లడ్డూ వేలం


బౌద్ధనగర్‌లో..

సనత్‌నగర్: భక్తులచే ఘన పూజలందుకున్న గణనాధుడి లడ్డూ వేలంపాటలు పోటాపోటీగా జరిగాయి. లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు గణేష్ మండపాల వద్ద స్నేహపూర్వక పోటీలు కొనసాగాయి. జెకెకాలనీ లక్ష్మీనివాస్ అధ్యక్షుడు చక్రధర్ యాదవ్ ఆధ్వర్యంలో కొలువుదీరిన వినాయక మండపం వద్ద లడ్డూను శ్యాం, చంద్రమోహన్, రాజశేఖర్‌లు రూ.65 వేలకు దక్కించుకున్నారు. అలాగే రవీంద్రనగర్ కాలనీ వినాయకుడి లడ్డూను బాలం సంతోష్–జ్యోతి దంపతులు రూ.46,116లకు కైవసం చేసుకున్నారు. బేగంపేట తాతాచారికాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకుడు సురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద లడ్డూను జగ్జీవన్‌గౌడ్ రూ.86 వేలకు దక్కించుకున్నారు. లడ్డూలను దక్కించుకున్న వారిని ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించి డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. బౌద్ధనగర్: పార్శిగుట్టలోని ఎంసీహెచ్ కాలనీలో అవిఘ్న ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి నిమజ్జన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో 11 రోజుల పాటు పూజలందుకున్న గణేశుని లడ్డు వేలం వేశారు. పది వేల రూపాయలతో ప్రారంభమైన 20 కిలోల లడ్డూ వేలం చివరికి రూ. 80 వేలకు లండన్‌లో చదువుతున్న పార్శిగుట్ట వాసి రాగిరి రుచితగౌడ్ సొంతం చేసుకుంది.


జెక్‌కాలనీలో..


రవీంద్రనగర్ కాలనీలో..

సందడిగా శోభాయాత్ర


నిమజ్జనానికి తరలుతున్న లంబోదరుడు


తీన్మార్ స్టెప్పులతో డ్యాన్సులు చేస్తున్న యువత



చిలకలగూడ: నవరాత్రులు మండపాల్లో కొలువుదీరి విశేష పూజలు అందుకున్న గణనాధుని నిమజ్జన వేడుకలు, శోభయాత్ర చిలకలగూడ ఠాణా పరిధిలో మంగళవారం రాత్రి ప్రారంభమై బుధవారం ఉదయం వరకు కొనసాగింది. విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనాల్లో లంబోదరున్ని నిమజ్జనానికి తరలించారు. డప్పుల దరువులు, తీన్‌మార్ స్టెప్పులతో గణపతి బప్పా మోరియా, జై బోలో గణేష్ మహారాజ్‌కీ జై అంటు నినాదాలు చేస్తు సాగిన శోభాయాత్ర ఆద్యంతం ప్రజల హృదయాల్లో భక్తి పారవశ్యాన్ని నింపింది. చిలకలగూడ మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన నీటి కొలనుల్లో వినాయక విగ్రహాలను పెద్దసంఖ్యలో నిమజ్జనం చేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డిల ఆదేశాల మేరకు సీఐ అనుదీప్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని సీఐ అనుదీప్ తెలిపారు.

అంతటా నిమజ్జన కోలాహలం

రాంగోపాల్‌పేట్: మంగళవారం ఉదయం నుంచి ప్రారంభమైన నిమజ్జన శోభా యాత్ర సికింద్రాబాద్‌లోని తెల్లవారు జాము వరకు కొనసాగింది. సికింద్రాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన గణనాథులు ఎస్డీరోడ్, ఎంజీరోడ్డు మీదుగా హుస్సేన్ సాగర్‌కు తరలించారు. భక్తుల కోలాహాలు, విచిత్ర వేషాల మధ్య సాగిన యాత్ర తెల్లవారు జాము వరకు కొనసాగింది. గణనాథుల నిమజ్జన యాత్ర తిలకించేందుకు భక్తులు బారులుతీరారు.


నిమజ్జన వేడుకల బందోబస్తులో చిలకలగూడ పోలీసులు

క్రీడలు సమైక్యతకు స్ఫూర్తి


మెమెంటోలు ప్రదానం చేస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

రసూల్‌పురా: క్రీడలు సమైక్యతకు స్ఫూర్తిగా నిలుస్తాయని మాజీ మంత్రి సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. విశ్వకర్మ జయంతి పురస్క రించుకుని బెంగాల్ హ్యాండ్ మేడ్ జ్యూవెల్లరీ వర్కర్స్ అసోసియేషన్ బుధవారం జింఖానా మైదానంలో ఏర్పాటు చేసిన ఒకరోజు ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ క్రీడా పోటీల కారణంగా వివిధ ప్రాంతాల్లో నివసించే క్రీడాకారులు ఒకే చోటు కలుసుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కిరణ్మయి. బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, కిషోర్ పాల్గొన్నారు.

అశోక్ కుటుంబానికి గవర్నర్ దత్తాత్రేయ పరామర్శ


అశోక్ (ఫైల్)

కంటోన్మెంట్: మోండా డివిజన్ బీజేపీ అధ్యక్షులు అశోక్ మరణం పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపం తెలిపారు. అశోక్ కుమారుడు వినయ్‌తో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. అశోక్ బీజేపీలో కీలకంగా పనిచేసేవారని, ఆయన మరణం పార్టీకి, కుటుంబానికి తీరని లోటు అని అన్నారు. అశోక్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నానని గవర్నర్ పేర్కొన్నారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందారు. ఇదిలా ఉండగా అశోక్ పుట్టిన రోజుకూడా బుధవారం కావడంతో సన్నిహితులు కన్నీరు మున్నీరయ్యారు.

రిజర్వేషన్లు పెంచిన ఘనత మోదీదే..


దివ్యాంగుడికి బ్యాటరీ సైకిల్‌ను అందజేస్తున్న బీజేపీ నేతలు

అడ్డగుట్ట: దివ్యాంగుల రిజర్వేషన్ పెంచిన ఘనత ప్రదాని మోదీకే దక్కుతుందని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొలి నాగేశ్వరరావు అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని అడ్డగుట్టలో జనగాం జిల్లాకు చెందిన సతీష్ అనే దివ్యాంగుడికి బ్యాటరీ సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగులకు మూడు శాతం ఉన్న రిజర్వేషన్‌ను నాలుగు శాతం పెంచిన వ్యక్తి ప్రధాని మోదీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి పులిపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏబీవీపీ విద్యార్థి నేతలపై కేసు నమోదు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో పరిధిలో మంగళవారం కొనసాగిన వినాయక నిమజ్జనం ర్యాలీలో తలెత్తిన ఘర్షణలో విద్యార్థుల పరస్పర తోపులాట నేపద్యంలో అక్కడే విధుల్లో ఉన్న ఓయూ పీఎస్ ఎస్సై, ఓ కానిస్టేబుల్ గాయాలయ్యాయి. దీంతో పాటుగా విధులుకు అడ్డ తగిలిన ఏబీవీపీకి చెందిన విద్యార్థి నేతలు పృథ్వీ,రాజు, జీవన్ తో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ రాజేందర్ తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

లిబర్టీ: తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్ ప్రైవేట్ మోటర్ డ్రైవర్స్ అండ్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈ నెల 22,23 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు యూనియర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమర్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా మహాసభల గోడ పత్రికను కార్యదర్శి లతీఫ్‌తో కలిసి ఆవిష్కరించారు. యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల మహాసభలో భాగంగా తొలి రోజులైన 22వ తేదీన భారీ ప్రదర్శన బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. రెండో రోజు 23వ తేదీన ప్రతినిధుల మహాసభ జరుగుతుందని అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.సాంబశివరావు, వీఎస్ బోస్, రాష్ట్ర అధ్యక్షులు జమాలయ, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం పాల్గొన్నారు.

సొసైటీ స్థలాన్ని జలమండలికి ఎలా కేటాయిస్తారు



బంజారాహిల్స్: యథాతథస్థితి కొనసాగించాలని హైకోర్టు తీర్పునిచ్చిన తర్వాత కూడా రెవెన్యూ అధికారులు తమ సొసైటీ స్థలాన్ని జలమండలికి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు శ్రీరాధికా కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కమిటీ సభ్యుడు రవికాంత్ ఆరోపించారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని తట్టికాన వాటర్ సెక్షన్ పక్కన తాము 1982లో పుక్‌రాజ్, వెంకట్‌రెడ్డి నుంచి 10 ఎకరాల పట్టా స్థలాన్ని కొనుగోలు చేశామని శ్రీ రాధికా హౌసింగ్ సొసైటీ పేరుతో సర్వే నెంబర్ ఓల్డ్ 129/90లో ధృవపత్రాలన్నీ తమవైపే ఉన్నాయని ఆయన అన్నారు. అయితే గత రెండు వారాల నుంచి రెవెన్యూ అధికారులు తమ స్థలంలోకి వచ్చి జలమండలికి స్థలం కేటాయించినట్లు తెలిసిందని ఈ మేరకు జలమండలి ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని ఇది కోర్టు ధిక్కరణ కిందికే వస్తుందన్నారు. తక్షణం నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు.

డీమ్డ్ యూనివర్సిటీల హోదాను రద్దు చేయండి


మంత్రి దామోదర్ రాజనర్సింహకు వినతి పత్రం సమర్పిస్తున్న బీసీ సంఘం నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీలకు డీమ్డ్ యూనివర్సిటీల హోదాను తక్షణమే రద్దు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహకు బీసీ విద్యార్థులు వినతి పత్రాన్ని సమర్పించారు. బుధవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ బొల్లెపల్లి స్వామి గౌడ్ ఆధ్వర్యంలో సచివాలయంలో మంత్రిని కలిసి విన్నవించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న డీమ్డ్ యూనివర్సిటీలలో ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీ, దివ్యాంగుల రిజర్వేషన్లు అమలు చేయకుండా కేవలం ధనవంతులకు మాత్రమే వైద్యం, విద్య అందుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే డీమ్డ్ యూనివర్సిటీల హోదాను రద్దు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో వినోద్, బాలరాజు, మహేశ్ తదితరులున్నారు.

విద్యార్థులను పరామర్శించిన చనగాని దయాకర్



ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 17న జరిగిన దాడిలో గాయపడిన శ్రీగాకాంత్ యాదవ్, చందులను టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ పరామర్శించారు. బుధవారం ఓయూ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, జరిగిన సంఘటన గురించి ఆరాతీసారు. కార్యక్రమంలో వలిగొండ నర్సింహ్మా, ఎన్ఎస్‌యూఐ ఓయూ ప్రసిడెంట్ మేడ శ్రీను, సురేష్, అభిలాష్ తదితరులున్నారు.

నేటి నుంచి 'రైజింగ్ విత్ కైండ్‌నెస్ యూత్ సమ్మిట్'

బంజారాహిల్స్: 'రైజింగ్ విత్ కైండ్‌నెస్ యూత్ సమ్మిట్'ను ఈ నెల 19 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. కామన్వెల్త్ సహకారంతో జరిగే ఈ శిఖరాగ్ర సదస్సు రెండో ఎడిషన్‌ను హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ బుధవారం ప్రకటించింది. ఈ సందర్భంగా తాజ్‌కృష్ణా హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, హార్ట్‌ఫుల్‌నెస్ యూత్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ నివేదిత శ్రేయాన్స్‌లు మాట్లాడారు.

ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై కొనసాగిన ఆంక్షలు

బంజారాహిల్స్: ప్రతియేటా నిమజ్జనాల తెల్లవారు మధ్యాహ్నం వరకు పూర్తయ్యే నిమజ్జనాలు ఈ సారి రాత్రి బుధవారం రాత్రి వరకు కూడా కొనసాగడంతో ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌ను రాత్రి వరకు కూడా తెరవలేదు. ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌ను బుధవారం రాత్రి వరకు మూసివేశారు. దీంతో సెక్రటేరియేట్ హిమాయత్‌నగర్ వైపు వెళ్ళాల్సిన వాహనదారులు లక్డీకపూల్ నుంచి వెళ్ళాల్సి వచ్చింది.

కలుషిత నీటి సరఫరా జరగకుండా చూడాలి


సమస్యను తెలుసుకుంటున్న కోట నీలిమ

సనత్‌నగర్: కలుషిత నీటి సరఫరా జరగకుండా జలమండలి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ కోరారు. సనత్‌నగర్ డివిజన్ డీఎస్ఎంకాలనీలో మంచినీటిలో మురుగు నీరు కలిసి వస్తుందని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె ఇక్కడి సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కలుషిత నీటి సరఫరాను వెంటనే అరికట్టాలని చెప్పారు. ఆ మేరకు అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి కలుషిత నీటి సరఫరాకు కారణాలను అన్వేషించి సమస్యను గురించి పరిష్కార చర్యలను చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సదస్సులో మాట్లాడుతున్న యూనియన్ జనరల్ సెక్రటరీ ఉదయ భాస్కర్

సికింద్రాబాద్: సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం రైల్వే ట్రైన్ మేనేజర్ల సెమినార్ జరిగింది. సెమినార్లో డివిజన్ వ్యాప్తంగా ఉన్న దాదాపు 100 మంది మేనేజర్లు పాల్గొన్నారు ఈ సందర్భంగా మెయిన్ మేనేజర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి చర్చించారు. ఇందుకు స్పందించిన మజ్దూర్ యూనియన్ నాయకులు మేనేజర్ల సమస్యల పరిష్కారం కోసం కషిచేస్తామని హామీ ఇచ్చారు. సెమినార్‌లో యూనియన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ ఉదయ భాస్కర్, ప్రెసిడెంట్ కే.శ్రీనివాస్, సికింద్రాబాద్ డివిజనల్ కోశాధికారి నరసింహారెడ్డి, యూనియన్ నాయకులు చరణ్ నాయక్, తరుణ్ కుమార్, అరుణ్ సింగ్, సులేమాన్, బెల్లి కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో ఆరోగ్యశ్రీ సిబ్బంది



బంజారాహిల్స్: ఆరోగ్య మిత్రలను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్య సిబ్బంది బుధవారం బంజారాహిల్స్‌లోని కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్ల పరిష్కారం జరిగే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జీఓ నెంబర్ 60 ప్రకారం నెలకు రూ.22,750లు వేతనం చెల్లించాలన్నారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్ సిబ్బంది గుర్తించాలన్నారు. తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరిస్తేనే విధుల్లో చేరతామని తేల్చిచెప్పారు.

ఆలయ హుండీ లెక్కింపు



సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని ఆలయాల హుండీల లెక్కింపు బుధవారం జరిగింది. దేవాదాయ శాఖ సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, దేవస్థానం ఈఓ శ్రీనివాసరాజుల పర్యవేక్షణలో సిబ్బంది హుండీ లెక్కింపు చేపట్టారు. మొత్తం 20 హుండీలకు సంబంధించి 170 రోజులకు గాను రూ.11,11,466ల ఆదాయం సమకూరినట్లు ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రాచార్యులు, సూపర్‌వైజర్ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు అర్చకులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటికీ మెంబర్‌షిప్ డ్రైవ్

సనత్‌నగర్: బీజేపీ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు సనత్‌నగర్ డివిజన్‌లో బుధవారం ఇంటింటికీ మెంబర్‌షిప్ డ్రైవ్ నిర్వహించారు. బూత్ నెంబర్–210 కో–ఆర్డినేటర్ కన్నూరి చంద్రకుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దయానంద్, జిల్లా అధికార ప్రతినిధి మూల రవీందర్ హాజరయ్యారు.


బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ మెంబర్‌షిప్ డ్రైవ్

మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి


మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళులర్పిస్తున్న రైల్వే ఇంజనీర్లు

అడ్డగుట్ట: భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి తరం ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని జెడ్‌సీఈటీఐ ప్రిన్సిపల్ వి.వి.జే. నాగేందర్ రావు పేర్కొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని బుధవారం దక్షిణ మధ్య రైల్వే ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లాలాగూడలోని జోనల్ రైల్వే సివిల్ ఇంజనీరింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపల్ నాగేందర్ రావు అసోసియేషన్ సభ్యులతో కలిసి విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దీకొండ పద్మనాభం, ప్రధాన కార్యదర్శి వై. లోకేశ్వర్, ఐలయ్య పాల్గొన్నారు.

వైద్యం.. బహు దూరం

11 దాటితే ఓపీసేవలు బంద్

- అందుబాటులో ఉండని వైద్యులు
- మందుల కొరత ఉందంటూ చిట్టీలు రాసి ఇస్తున్న వైనం
- ఇదీ లాలాపేట కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో పరిస్థితి




లాలాపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో క్యూ లైన్‌లో పేషెంట్లు

లాలాపేట: 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉండాల్సిన లాలాపేట కమ్యునిటీ హెల్త్ సెంటర్‌లో ఉదయం 11 గంటలు దాటితే ఓపీ బంద్ చేస్తూ వైద్య సేవలను నిలిపివేస్తున్నారు. 24 గంటల పాటు డ్యూటీలో ఉండే స్టాఫ్ నర్సులు ఇక్కడికి వచ్చిన వారికి ఎమర్జెన్సీ వైద్యసేవలు అందించాల్సి ఉన్నప్పటికీ వైద్యులు లేరని పేషెంట్లను తిప్పి పంపిస్తున్నారు. మరి కొందరు వైద్యులు, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని అక్కడికి వచ్చిన కొందరు పేషెంట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. వివిధ జ్వరాలతో వైద్యం కోసం వచ్చిన వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

◆ లాలాపేట వినోభానగర్‌కు చెందిన జీఎం రమేష్ తన కుమార్తె వైద్యం కోసం సోమవారం హాస్పిటల్‌కు వస్తే ఈ రోజు సెలవు అంటూ వెనక్కి పంపించారు. బుధవారం తిరిగి మరోసారి హస్పిటల్‌కు వెళితే అక్కడి వైద్యులు పరీక్షలు చేశారు కానీ దానికి సంబంధించిన మందులు ఇక్కడ అందుబాటులో లేవని బయట తీసుకోవాలనీ చిట్టి రాసి ఇచ్చారు. ఇది ఒక రమేష్‌కు సంబంధించిన సంఘటన మాత్రమే కాదు ఇలా చాలా మంది గత కొన్ని రోజుల నుంచి లాలాపేటలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలకు ఓ ఉదహారణ మాత్రమే.



జ్వరాలతో క్యూ కడుతున్న ప్రజలు..

మారుతున్న వాతావరణ పరిస్థితులకు తోడుగా దోమల విజృంభణతో ప్రజలు వైరల్ జ్వరాల భారిన పడుతున్నారు. తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని తార్నాక, లాలాపేట, శాంతినగర్, లాలాగూడ తదితర ప్రాంతాల్లో డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, దగ్గు, జలుబు వంటి కేసులు నిత్యం వందల సంఖ్యలో నమోదైతున్నాయి. లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రానికి వైద్యులు లేక సరైన వైద్య సేవలు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. దాని పక్కనే ఉన్న పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రానికి జ్వర బాధితులు క్యూ కడుతున్నారు. ప్రభుత్వం స్పందించి బస్తీల్లో, కాలనీల్లో పెద్ద ఎత్తున వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈఎస్ఐలోనూ అంతంతే...!

డిస్పెన్సరీలలో పారామెడికల్ సిబ్బంది కొరత

అమీర్‌పేట: ఈఎస్ఐ డిస్పెన్సరీలలో పారామెడికల్ సిబ్బంది కొరత రోగులకు శాపంగా మారింది. తగినంత సిబ్బంది లేని కారణంగా సకాలంలో వైద్యం అందడం లేదు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న డిస్పెన్సరీల్లో చాలా కాలం నుండి ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ పోస్టులు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయి.ఈఎస్ఐ కార్డు లబ్ధిదారుల సంఖ్య అంతకంతకూ పెరిగి పోవడం, నియామకాలు చేపట్టక పోవడంతో ఉన్న సిబ్బందిపై తీవ్ర ఒత్తిడికి లోనవుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఫార్మాసిస్టులు లేని చోట్ల ఇతర సిబ్బంది చేత మందులు ఇప్పిస్తున్నారని రోగులు వాపోతున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 300 పోస్టుల వరకు ఖాళీగా ఉన్నట్లు ఈఎస్ఐ డైరెక్టరేట్ అధికారులు పేర్కొంటున్నారు. అయితే కాంట్రాక్ట్ విధానం ద్వారా 182 పారామెడికల్ పోస్టులు భర్తీ చేయాలని రెండేళ్ల క్రితం జాయింట్ డైరెక్టర్లకు గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.అందుకు సంబంధించి నోటిఫికేషన్ కూడా ఇచ్చి అర్హుల నుండి దరఖాస్తులు సేకరించారు. కాని నేటి వరకు పోస్టులు భర్తీ చేయలేదు. నగరంతో పాటు శివారు ప్రాంతంలోని డిస్పెన్సరీల్లో రోగుల రద్దీ అంతకంతకూ పెరిగి పోతున్నా అందుకు తగ్గట్లుగా సిబ్బంది నియామకాలు చేపట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి పోస్టులను వెంటనే భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావం

పంజగుట్ట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దొరల అరాచకాలకు ఎదురొడ్డి నిలిచిన వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటుచేయాలని తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావ సభలో వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ తల్లి ఐలమ్మ ఫౌండేషన్ ఆవిర్భావ సభ బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ అధ్యక్షుడు చిట్యాల యాకయ్య అధ్యక్షత వహించారు. ఫౌండేషన్ నూతన కమిటీని ప్రకటించడంతో పాటు లోగోను ఆవిష్కరించారు. అతిథులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డీజీ నరసింహారావు, సీపీఐ రాష్ట్ర నాయకులు పశ్య పద్మ, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజాలు పాల్గొన్నారు.